స్కెచ్

# తొలి అనుభవంలోని చేదు

"శర్మ"

ఈ కాస్తా వాసు స్వార్జితం. అంటే చేతులారా గడించింది. ఓ అప్పూ, సప్పూ కాదు. దానం ధర్మం కింద వచ్చిందీ కాదు. దీని జమాఖర్చులకి మరో మొనగాడికి జవాబుదారీ అవసరం లేదు. ఉచ్ఛమో, నీచమో ఎలాగైతేనేం ఉద్యోగంలో తలదూర్చి జనవరి ముప్ఫయిఒక్క రోజులూ వళ్లు వంచి, బుర్ర దించి పనిచేసి గడించినది. నూట పదకొండు రూపాయలూ అయిదణాల చిల్లరా.

ఆ జీతాలనాటి సాయంత్రం అందరు ఉద్యోగస్థులకీ ఇచ్చినట్లే వాసుకి కూడా పక్షపాతం లేకుండా ముట్టవలసిన కరువుబత్తెం, మిగతా బత్తేలన్నీ కలిపి జీతం అణాపైసలతో సహా ఇచ్చేశారు ఆఫీసువారు. అంత మొత్తమూ ఒకేసారి ఇచ్చేశారు. అంత మొత్తమూ ఒకేసారి తప్పుమని ఎగిరిపోయింది. ఎలాపోయింది? ఎప్పుడుపోయింది? అసలు ఏమయిందేమిటి? వెర్రిగాకపోతే ఇంత తెలిస్తే ఇక అది పోతుందా? వాసు పోనిస్తాడా? ఆఖరికి వారఫలితాల్లోనైనా తెలియలేదు.

* * *

వాసు ఏమీ వెర్రివాడు కాడు; అప్రయోజకుడూ కాడు. చూస్తూండగా తనది ఓ గడ్డిపోచ కూడా అవతలికి పోనియ్యడు. అంటే పిసినారి అని కాదు. ఏ కానీ ఐనా తన అనుభవంలోకి రానిదే వదలడానికి అతనికి మనస్సురాదు. అలాంటి అవకాశంకూడా అతనికి ఎప్పుడూ రాలేదు. జేబులో ఉన్న దెప్పుడూ ఈ కాస్తే అనిపించేది. జేబులో ఉన్న అణాలూ, బేడలూ, లెక్కచూసుకొని, ధీమాచేసుకొని మరీ హోటల్లోకి ప్రవేశించేవాడు. జులాయిగా తిరగడానికి గాని, ఓరూపాయో, అర్థో లెక్క తెలియకుండా తప్పిపోయినట్లు గుపిస్తే, పోనీలే—అని సర్దుకోడానికి గాని సావకాశం లేనివాడు. అలా అని అవసరమయితే పీలు దొరకిందికదా అని స్నేహపాత్రులయిన వారికి చేతిఖర్చు తగిలించడం ఇత్యాది తెగింపులూ లేవు. ఇప్పటివరకూ వాసుకి నలుగురి స్నేహితుల్ని వెనకేసుకుతిప్పుకోడానికి తాహతు లేదు; నలుగురి స్నేహపాత్రుల వెనక నీడమల్లే తిరగడానికి స్వాభిమానాన్ని వదలగల గుండె నిబ్బరమూ లేదు. ఇటు నిరుపేదా అయాడుకాడు; అటు కాస్త కలవాడూ అయాడుకాడు: ఇలాంటి కాంప్లెక్సుల మధ్య అతని జీవితం ఇరుక్కుపోయింది. ఏదో తన పెద్దలను మల్లే మర్యాదగా గుట్టుకుపడి జీవితాన్నిలాగడం తనవిధీ, ధర్మమూ.

ఇలాంటి పెద్దమనిషికి తన మొట్టమొదటి స్వార్జితం అయిన నూటపదకొండు రూపాయల అయిదు అణాల చిల్లరా తనకి ఏడుకొండల వాడిలా దర్శనం ఇచ్చి వెంటనే నామం పెట్టిందంటే ఎంత ఘటన!

నోట్లు కాగితాలూ, చిల్లర కాసులూ, స్వహస్తాలతో తీసుకున్న జ్ఞాపకం తనకి బాగా ఉంది. తన చేతులకి స్పర్శజ్ఞానం ఇంకా పోలేదు. వేడిమి, చల్లదనమూ, మెత్తనా, గట్టితనం అన్నీ చటుక్కున చెప్పగల తన చేతులే సాక్ష్యం. ఆఫీసు నౌఖరు సలాముచేసి అందుకున్న చేతులుకూడా ఇవే కాదూ...! బాబుగారు జీతంపుచ్చుకొని ఆనందభరితులై ఉన్న ఆ చల్లని ఘడియల్లో బంట్రోతు విధేయపూర్వకంగా వినయం సూచిస్తూ సమర్పించిన సలాం వాసు పరధ్యానంగా అందుకున్నాడేగాని, ఆ నమ్రతలో ఉండే అర్థాన్ని గమనించనే లేదు. బంట్రోతు ముఖారవిందం ఆశలో విప్పారినప్పుడు—దాని అర్థమూ వాసు బుర్రకు ఎక్కలేదు. ఇదికూడా స్వార్జితమైన గౌరవమే. కాని జీతపురాళ్ళ ఆనందం తన తలలో ఇమిడినట్లుగా, ఇది ఇమడలేదు. తన నెత్తిమీదకు తోయబడిన ఈ గౌరవపు అర్థం, బంట్రోతు వాని దరహాసిత వదనంలోని అర్థం, స్వార్జనాపరిత్యక్తుడై, విచారపూరితుడైన వాసుకి ఎక్కువ బాగా అర్థం అయింది ఇప్పుడు. స్వార్జన అంతా కలగా అనిపిస్తోంది. బంట్రోతు అందిచ్చిన గౌరవానికి వాసు అప్పుపడే ఉంటాడు. అది నిలబెట్టుకోవలసిన బాధ్యత తనదే.

తను హోటల్‌ని సందర్శించడం వాసు కళ్ళకు కట్టినట్టుగాఉంది. బాదంహల్వా, పూరీ పొటేటో బాదంకీర్, వీట్లరుచి ఇంకా మరచి పోలేదు. అయ్యరు టేబులుదగ్గిర తనకు అచ్చివచ్చిన పాత పర్సులోంచి నోట్లుతీసి సమర్పించి చిల్లర ప్రసాదంగా స్వీకరించింది బాగా గుర్తే. ఆ చిల్లర వేరే జేబులో పడేశాడు. అవి సాక్ష్యం గానే ఉన్నాయి. కాని ఉన్నదున్నట్టుగా పర్సు మాత్రం ఎగిరి చక్కాపోయింది. ఎవళ్ళకి తెలుస్తుంది యీ జనసందోహంలో?

హోటల్ మెట్లు ఎక్కబోతోంటే ఎవడో అడ్డుతగిలి తన కేదో సహాయం చెయ్యమనీ, భగవంతు డతన్ని రక్షిస్తాడనీ, ఆ దయ ఈ పేద వాడిమీద కాస్త చూపెట్టాలనీ ఏదో గొడవ ప్రారంభిస్తూ మెట్లు పైదాకాకూడా వచ్చాడు. వాసుకు ఇవన్నీ బుర్ర కెక్కలేకదూ! ఇంకా తన జీతపురాళ్ళు సంపాదించిన చిరునవ్వు తన మొహంమీదనుంచి వెలిసిపోలేదు. జేబు ఖాళీ అయిందనీ అచ్చొచ్చిన పాతపర్సు డబ్బుతోసహా కొట్టుకుపోయిందనీ తెలుసుకున్న తర్వాత వాసుకి ఆ ముసలివాడికి సహాయం చెయ్యవలసిందేమో నని, ఓక్షణంలో అనిపించింది. అయితే వాసు డిగ్రీ పుచ్చుకొన్నవాడు కాబట్టి, ఇలాంటి చేదస్తపు అభిప్రాయాలే దేశాన్ని నీరసపరుస్తున్నాయని స్థైర్యంగా వదలేశాడు. చెయ్యిజాపి కర్రతో కుంటుకుంటూ వెనకాలే పరుగెడుతూ ఒక కానీ దయచేయమని ప్రాధేయపడిన బిచ్చగాడికి నిజంగా ఓ అణా ఇవ్వవలసిందే అనిపించింది. ఆఫీసులో గంటలప్రకారం పని చేస్తూన్నందుకు నెలకీ తనకింత ఇస్తున్నారే, కాళ్లు లేని వాడు, పగలంతా కుంటుకుంటూ కానీ, అర్ధణా కోసం అరిచి చచ్చేవాడికి ఓ అణా అయినా పారెయ్యొద్దా అనిపించింది. జేబులో డబ్బులున్నప్పుడు: "ఏం వాసూ! నీకు మతిలేదూ? ఇలా అందరికీ దానం చెయ్యడానికే పుట్టేవా ఏమిటి? ఇంటికి చేరడానికి డబ్బులుండక్కర్లేదూ? ఐనా నీ ఒక కానీతోటి వాళ్ళ బీదరికం పోతుందా? వాళ్ళలా అరుస్తూనే ఉంటూరు. వాళ్ళని అడుక్కోడానికి ఉత్సాహపరచకూడదు సుమీ" అనిపించేది.

నిజంగా హోటలు మెట్లమీద వెనకనే వచ్చిన ముసలివాడికి సహాయం చేసిఉంటే ఈ డబ్బే పోయేది కాదేమో? ఇప్పుడు నిజంగా డబ్బే ఉంటే ఒక అయిదురూపాయల నోటు వాడికి ఇచ్చెయ్యడానికి వాసుకి అభ్యంతరం ఉండేదికాదు. చదువుకున్నవాడైనా ఆఖరికి బలహీను డయిపోయాడు.

పుచ్చుకోవడానికి వాడికికూడా అభ్యంతరం ఉండేదికాదు. కాని జేబులో డబ్బు మాత్రమే లేదు. ఆ జేబులోకి మళ్ళీ చెయ్యిదూర్చి నెలజీతం అంతా పోయిందన్న బాధ తెలుసుకొని ఎక్కువగా అనుభవించడానికి వాసుకి భయంగా ఉంది. చెమ్మగిల్లిన కళ్లు దీనంగా నిశ్చలంగా జేబుని చూస్తున్నాయి. జేబు ఏమీ ఎరగనట్టే ఉంది.

రోడ్డుప్రక్కని జనం తోడతొక్కిడిలో నడుచుకుపోతున్నారు. స్తంభాన్ని ఆనుకుని వాసు శూన్యంగా చూస్తున్నాడు. జనసందడిలో తనను తోసుకొని వడిగా పోతూన్న మనిషికేసి వాసు తిక్కగా చూసేడు. వాడు ఇందాకా తనను నిలబెట్టి ఏదో చెప్పినట్లున్నాడు: తను పొరుగూరివాణ్ణనీ, చాలా పరువు మర్యాదలు కలవాణ్ణనీ, ఫలానావారి పేరు తెలుసా అని కూడా అడిగేడు. తిరిగి పోవడానికి డబ్బులేదనీ తను తెలుసున్నవాడిలా కనిపిస్తున్నాడనీ ఏదో కొంచెం రూ. 20 లు హెల్పుచేస్తే తిరిగి పంపించేస్తాననీ ఎడ్రస్సు అదీకూడా ఇవ్వబోయి చంపాడు. వీడే పర్సు కాజేసి ఉంటాడేమో అని వాసుకి చటుక్కున తట్టింది. ఎంతో ఆశతో గబగబా ముందడుగువేశాడు. ఈ జనసమూహంలో ఎవడో ఏం తెలుస్తుంది?

జనం ఎప్పటిలాగే ఏమీ జరగనట్టుగానే సందడిగా నడచిపోతున్నారు. బస్సూ, కార్లూ, చప్పుడుచేస్తూ పోతున్నాయి. హోటల్లో రేడియో పాడుతూనే ఉంది. పనివాళ్లు కేకలువేస్తూ బరువులు మోస్తూ పోతున్నారు. వాసుకిమాత్రం—ఇదంతా అగమ్యంగా కనబడుతూంది. ఇంత నిరాశలోనూ జేబులోకి చెయ్యిదూర్చి ఎన్నో సార్లు మళ్ళీ డబ్బుతోటి పర్సు ప్రత్యక్షంకాకూడదా అనుకొన్నాడు. అన్ని కోరికలకీ జవాబుగా జేబు ఖాళీగానే ఉండిపోయింది.